సాక్షి
చిత్తూరు
ఆదివారం । 2 । జూలై । 2023



మ్యాంగో ర్యాంప్ సీజ్

మామిడి రైతుకు రవాణా చార్జీలు చెల్లించని వ్యాపారిపై అధికారుల చర్యలు చేపట్టారు. సదరు ర్యాంప్‌ను సీజ్ చేశారు. - 8లో



అధికారులతో పనేముంది నాయనా?

జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ప్రతి నెలా వలంటీర్ మా ఇంటికే వచ్చి పింఛన్ ఇచ్చిపోతున్నాడు నాయనా అని వృద్ధురాలు తెలిపింది. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	26
తిరుపతి	34	26
తిరుమల	30	22
గూడూరు	37	28
నగరి	36	27

సంక్షేమానికి 'సురక్ష'

క్షేత్రస్థాయిలో పేదల కష్టసుఖాలను తెలుసుకోవాలి. పార్టీలు.. కులాలు.. మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి. సమాజంలోని అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాల లబ్ధిని చేకూర్చాలి. ప్రజావసరాల మేరకు సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి. ఇదే లక్ష్యంతో 'జగనన్న సురక్ష'కు శ్రీకారం చుట్టినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం
- క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరిస్తాం
- ప్రజారోగ్య రక్షణకు పెద్దపీట వేస్తున్నాం
- చంద్రబాబు మోకాలొడ్డినా ప్రాజెక్టులు నిర్మిస్తాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వేదికపై మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు

పుంగనూరు : ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై.. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే మహోన్నతమైన కార్యక్రమమే జగనన్న సురక్ష అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం పుంగనూరులో జగనన్న సురక్షకు కలెక్టర్ షణ్మోహన్ ఆధ్వర్యంలో ఆయన శ్రీకారం చుట్టారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు ద్వారకనాథరెడ్డి, ఆరణి శ్రీనివాసులు, సివిల్ సప్లయ్ ఎండీ వీరపాండ్యన్ పాల్గొన్నారు. ఈ క్రమంలో ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రేషన్‌కార్డు దారులకు గోధుమ పిండి, రాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడారు. అర్హులైన వారికి సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పథకాలు అందకుంటే వారిని గుర్తించి లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. గతంలో ఎవరైనా సర్టిఫికెట్ పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, అలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా ధ్రువీకరణ పత్రాలు తీసుకునే వెసులుబాటును సురక్షతో కల్పించామని వివరించారు. జిల్లా యంత్రాంగం బృందాలుగా జగనన్న సురక్ష అమలు తీరును పకడ్బందీగా పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఏది ఏమైనా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే చిత్తశుద్ధితోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వెల్లడించారు. ఈ మేరకు అధికారులు సైతం బాధ్యతగా తీసుకుని ప్రభుత్వం నిర్దేశించిన నెలలోపు జగనన్న సురక్షను పటిష్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రజారోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అందులో భాగంగా పోషకాహారం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. రేషన్ దుకాణాల ద్వారా రాగులు, గోధుమ పిండి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతులు అధిక విస్తీర్ణంలో చిరుధాన్యాలను సాగు చేయాలని సూచించారు. సివిల్ సప్లయ్ అధికారులు సైతం రైతుల నుంచి గిట్టుబాటు ధరకే చిరుధాన్య పంటలను కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి 2,300 వ్యాధులను తీసుకువచ్చి పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారని వెల్లడించారు. ప్రజారంజక పాలనను చూసి ఓర్వలేకే చంద్రబాబు అసత్య ప్రచారాలు, వ్యక్తిగత దూషణకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

తొలిరోజు 7,882 సర్టిఫికెట్లు జారీ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం(తొలిరోజు) పకడ్బందీగా నిర్వహించారు. చిత్తూరు జిల్లావ్యాప్తంగా తొలిరోజు 45 సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహించారు. 671 మంది వలంటీర్లు పాల్గొన్నారు. 41,666 కుటుంబాలకు తొలిరోజు సురక్ష సేవలందించారు. 7,882 సర్వీసులు నమోదుకాగా, ఆ సర్వీసులకు సంబంధించి ప్రజల నుంచి ఎలాంటి రుసుం స్వీకరించకుండా ఉచితంగా అక్కడికక్కడే సర్టిఫికెట్లను జారీచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమం పట్ల జిల్లా ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో 600 హామీలు గుప్పించి ఒక్కటీ నెరవేర్చని చంద్రబాబుకు అసలు ఓటు అడిగే అర్హతే లేదని స్పష్టం చేశారు. తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు , పలమనేరు, కుప్పం ప్రాంతాలకు తాగు, సాగు నీరు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రిజర్వాయర్లు నిర్మించేందుకు అనుమతులు ఇచ్చారని తెలిపారు. అలాగే గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్ ద్వారా నీరు అందించి ఈ ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలని బృహత్తర కార్యక్రమం చేపట్టామన్నారు. అయితే చంద్రబాబు తప్పుడు ఆరోపణలతో స్టేలు తెచ్చి, పనులు ఆపించారని ఆరోపించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రాజెక్టులు నిర్మించి ప్రజలకు నీరు అందిస్తామన్నారు. చంద్రబాబు కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, వారే తగిన గుణపాఠం నేర్పుతారని స్పష్టం చేశారు. టీటీడీ బోర్డు మెంబరు పోకల అశోక్‌కుమార్, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము పాల్గొన్నారు.



లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న మంత్రులు మంత్రి పెద్దిరెడ్డి, కారుమూరి, కలెక్టర్ షణ్మోహన్



సమావేశానికి హాజరైన ప్రజలు

పేదల అభ్యున్నతే లక్ష్యం

పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారు. చంద్రబాబుకు ప్రజలు సంతోషంగా ఉంటే ఓర్వలేరు. ఎల్లోమీడియా అండతో ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తుంటారు. అయితే అసత్య ఆరోపణలను ఎవరూ నమ్మే పరిస్థితి లేదు.

– మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

ప్రస్తుతం రాష్ట్రంలో 65 మెట్రిక్ టన్నుల చిరుధాన్యాలను సాగు చేస్తున్నారు. దీన్ని 1.75 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచేందుకు కృషి చేస్తున్నాం. కిలో రాగులను రూ.38 చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నాం. ప్రస్తుతం నగర, పట్టణ ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల ద్వారా గోధుమ పిండి, రాగులను కార్డుదారులకు అందిస్తున్నాం. త్వరలోనే గ్రామీణులకు సైతం పంపిణీ చేస్తాం.

– సివిల్ సప్లయ్ ఎండీ వీరపాండ్యన్

అర్హులందరికీ నవరత్నాలు

అర్హులైన పేదలందరికీ నవరత్నాలు అందించడమే సురక్ష పథకం లక్ష్యం. జిల్లాలో ఇప్పటికే 97శాతం సంక్షేమ పథకాలను అందిస్తున్నాం. ఎవరైనా అర్హులకు రాకుంటే వారిని గుర్తించి లబ్ధి చేకూరుస్తాం. ఈ మేరకు అధికారులకు పక్కాగా ఆదేశాలు జారీ చేశాం.

– కలెక్టర్ షణ్మోహన్

వేషగాళ్లతో అప్రమత్తం

ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి చంద్రబాబుకు వణుకు పుట్టింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వచ్చే వేషగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– ఎంపీ రెడ్డెప్ప

నాలుగేళ్లలోనే..

చంద్రబాబు 14 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలోనే చేసి చూపించారు. కుప్పం ప్రజలకు హంద్రీ నీవా కాలువ ద్వారా తాగునీరు అందించనున్నారు.

– జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పారదర్శకంగా నగదు జమ

మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారు. ఇచ్చిన మాట మేరకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నారు. గతంలో చంద్రబాబు రుణమాఫీ పేరిట ప్రజలను మోసం చేశారు. జన్మభూమి కమిటీల పేరుతో రూ.కోట్లు స్వాహా చేశారు.

– తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

జగనన్నకు కృతజ్ఞతలు

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మాకు రేషన్‌కార్డు వచ్చింది. మేము ఉమ్మడి కుటుంబంలో ఉంటున్నాం. రేషన్‌కార్డు కావాలని ఫ్లిట్ ఆప్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా పలు కారణాలతో రాలేదు. ప్రస్తుతం సురక్షలో దరఖాస్తు చేసుకోగానే ఒక రోజులో కొత్త రేషన్‌కార్డు వచ్చింది జగనన్నకు కృతజ్ఞతలు. – చాముండేశ్వరి, మురగానిపల్లె, చిత్తూరు



ఆనందంగా ఉంది

ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. కానీ సాంకేతిక కారణాలతో కార్డు రాలేదని అధికారులు తెలిపారు. సురక్ష కార్యక్రమంలో భాగంగా తిరిగి దరఖాస్తు చేసుకుంటే వెంటనే పైసా ఖర్చు లేకుండా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరుకావడం ఆనందంగా ఉంది. సంక్షేమ పథకాలకు ఇప్పుడు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు వచ్చింది. – రమాదేవి, మురగానిపల్లె, చిత్తూరు



న్యూస్‌రీల్

8న పలమనేరులో అగ్రిల్యాబ్ ప్రారంభం



అగ్రి ల్యాబ్ ఎదుట వ్యవసాయశాఖాధికారులు

పలమనేరు: పట్టణంలోని ఏఎంసీ ప్రాంగణంలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఈనెల 8వ తేదీన ప్రారంభించనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ తెలిపారు. శనివారం ల్యాబ్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీలు అన్నపూర్ణదేవి, శివకుమార్, ఏఓ సంధ్య పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.8లక్షల విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదానం పథకానికి విజయవాడకు చెందిన గుమ్మడి సుధీర్ కుటుంబ సభ్యులు రూ.8లక్షలు విరాళంగా అందించారు. శనివారం ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశుకు నగదు చెక్కు అందించారు. ఆలయాధికారులు దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపటి 'స్పందన' రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. శనివారం ఆయన మాట్లాడుతూ 4 వ తేదీన ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో అధికారులు ముందస్తు ఏర్పాట్లల్లో నిమగ్నమై ఉంటారని తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని కోరారు.

వేకువ నుంచే పింఛన్ల పంపిణీ

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో శనివారం వేకువజాము నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. మొత్తం 2,59,454 మంది లబ్ధిదారులకు సంబంధించిన పింఛన్ల మొత్తాలను ప్రభుత్వం శుక్రవారమే విడుదల చేసినట్లు వెల్లడించారు. దీంతో ఉదయం 10 గంటలకల్లా 50 శాతం, సాయంత్రానికి 89.35 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు వివరించారు. మిగిలిన వారికి రెండు రోజుల్లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఎంఈఓ-1 పోస్టులకు నేడు కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈఓ-1 పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు శనివారం తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లాలో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సీనియారిటీ జాబితాలను చిత్తూరు, తిరుపతి డీవైఈఓ కార్యాలయాలకు పంపినట్లు వివరించారు. జాబితా ప్రకారం ప్రధానోపాధ్యాయులు సర్వీస్ రిజిస్టర్‌తో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు



ప్రభావతీదేవి, డీఎంహెచ్‌ఓ

చిత్తూరు రూరల్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తామని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి స్పష్టం చేశారు. శనివారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓను పలువురు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

భక్తుల సౌకర్యాలకే తొలి ప్రాధాన్యం



సమావేశంలో చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యాలకే తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. శనివారం ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి 18.60 ఎకరాలను అందించేందుకు సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, కలెక్టర్ షణ్మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆలయాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ క్రమంలో మోహన్‌రెడ్డి, వెంకటేశు విలేకర్లతో మాట్లాడుతూ ఆగస్టులో లడ్డూ పోటుకు నూతన భవనాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. నిత్యాన్నదానంలో ఒకేసారి 8వేల మంది భక్తులు ప్రసాదం స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. వినాయక సదన్‌లో వంద గదులు, బస్టాండ్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు నరసింహులుశెట్టి, మారుతీశ్వర్ రావు, ప్రమీల, రామసుబ్బమ్మ, వెంకటరమణమ్మ, సుబ్బలక్ష్మమ్మ, ఎక్స్ అఫిషియో సభ్యుడు సోమశేఖర్ గురుకుల్, ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవ రెడ్డి, హేమమాలిని పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న జేడీ ప్రభాకర్

గుడిపాల : జిల్లాలోని పాడి రైతులకు 510 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న, జొన్న విత్తనాలను అందిస్తున్నట్లు పశుసంవర్థకశాఖ జేడీ ప్రభాకర్ తెలిపారు. శనివారం గుడిపాల, వసంతాపురం, 189 కొత్తపల్లెలో బ్రూసెల్లా టీకా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జేడీ మాట్లాడుతూ మొక్కజొన్న 145, జొన్నలు 365 టన్నుల విత్తనాలు జిల్లాకు వచ్చాయన్నారు. ఆర్‌బీకేల ద్వారా పాడి రైతులకు రాయితీపై పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. మొక్కజొన్న విత్తనాలు కిలో రూ.71.5 ఉండగా రూ.17లకే అందజేస్తున్నామని, జొన్నలు కేజీ రూ.71.5 ఉంటే రూ.17.88 పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ డీడీ ఆసిఫ్, మురళి, వైద్యాధికారులు సాయిసుధ, రవితేజ, హసీమ్ పాల్గొన్నారు.

ఈ-స్టాంపింగ్ ద్వారా ఫీజుల చెల్లింపు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే రిజిస్ట్రేషన్ల ఫీజులను ఈ-స్టాంపింగ్ ద్వారా చెల్లించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ జూన్‌లో జిల్లావ్యాప్తంగా 20 శాతం ఫీజులను ఈ-స్టాంపింగ్ ద్వారా చెల్లించారన్నారు. ఈనెలలో 50 శాతం వరకు వినియోగదారులు చెల్లించే విధంగా సబ్‌రిజిస్ట్రార్లు చర్యలు చేపట్టాలని సూచించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, స్టేట్‌బ్యాంక్, యూనియన్ బ్యాంక్, సీఎస్‌ఈ సెంటర్లలో ఈ-స్టాంపింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఒకే చలానాతో రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, యూజర్ చార్జీలను చెల్లించవచ్చని తెలిపారు.

22న ప్రత్యేక లోక్‌అదాలత్



న్యాయమూర్తి కరుణకుమార్

చిత్తూరు అర్బన్: జిల్లావ్యాప్తంగా ఈనెల 22వ తేదీన ప్రత్యేక మెగా లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మోటారు వాహనాలు, రెవెన్యూ, భూ సేకరణ, జేసీ కోర్టులో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. అలాగే సెప్టెంబరు 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్రిమినల్ కేసుల్లో పేదలకు ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ భద్రత



సూచనలిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 4వ తేదీన జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పోలీసులు పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. శనివారం ఈ మేరకు ఎస్పీ రిషాంత్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి ముఖ్యమంత్రి పర్యటన, కాన్వాయ్ రూట్ మ్యాప్, హెలీప్యాడ్ ప్రాంతాలను పరిశీలించారు. వాహనాల పార్కింగ్, బహిరంగ సభలో ప్రజల కూర్చునే గ్యాలరీలను తనిఖీ చేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బస్సులు భారీ వాహనాల మళ్లింపులపై చర్చించారు. అలాగే బందోబస్తుపై కీలక ఆదేశాలు జారీ చేశారు. సుమారు 2,500 మంది పోలీసులతో కట్టుదిట్టంగా భద్రత కల్పించనున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సుధాకర్, నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, సీఐలు విశ్వనాథరెడ్డి, మద్దయ్య ఆచారి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏనుగుల సంచారం



ధ్వంసమైన టమాట పంట

సదుం: మండలంలో ఏనుగుల సంచారం కొనసాగుతోంది. శనివారం ఏనుగుల గుంపు జోగివారిపల్లె పంచాయతీకి చేరుకుంది. పంటలను తొక్కుకుంటూ ఏనుగులు వెళుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టమాట పంటను నాశనం చేయడంతోపాటు, డ్రిప్ సామగ్రిని ధ్వంసం చేసినట్లు రైతులు రమణారెడ్డి, నరహరి, మదన్ తెలిపారు.

మాతాశిశు మరణాల నివారణకు కృషి

చిత్తూరు రూరల్: జిల్లాలో మాతాశిశు మరణాల నివారణకు కృషి చేయాలని డీఐఓ రవిరాజు ఆదేశించారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యులు, ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతాల వారీగా హైరిస్క్ కేసులు, శిశు రణాలపై ఆరా తీశారు. అనంతరం డీఐఓ మాట్లాడుతూ గర్భిణుల్లో హైరిస్క్ కేసులను గుర్తించి తగిన సలహాలు అందించాలన్నారు. వారికి నిర్ణీత సమయంలో విధిగా పరీక్షలు చేయిస్తూ ఆరోగ్య వివరాలను మండల వైద్యాధికారులకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు లోకేష్ ఉషశ్రీ, మీనాకుమారి, ధనశేఖర్, శిరీష, రేణుకప్రభ, నిర్మల పాల్గొన్నారు.

క్లుప్తంగా

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి



మునేంద్ర(ఫైల్)

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : జీడీ నెల్లూరులోని ఓ వైన్‌షాప్ వద్ద శుక్రవారం రాత్రి అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. కార్వేటినగరం మండలం కేపీ అగ్రహారం పంచాయతీ జాండ్లపేట గ్రామానికి చెందిన ఎం.మునేంద్ర(32)కు మద్యం అలవాటు ఉంది. ఈ క్రమంలో అతిగా మద్యం తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రామాంజనేయులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి మునేంద్ర అప్పటికే మరణించినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న కిషోర్‌కుమార్ (40) అనే వ్యక్తిని ఎస్ఈబీ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ జోగేంద్ర ఆధ్వర్యంలో నగరంలోని లెనిన్‌నగర్‌లో తనిఖీలు నిర్వహించగా కిషోర్‌కుమార్ వద్ద 320 కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టుబడ్డాయి. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

గంగాసారంలో మ్యాంగో ర్యాంప్ సీజ్

- రవాణా చార్జీలకు వ్యాపారి కోత
- తనిఖీ చేపట్టిన తహసీల్దార్
- చిల్లర దందా బట్టబయలు



విచారణలో తహసీల్దార్ కిరణ్

చిత్తూరు రూరల్: మామిడి వ్యాపారి రైతులకు రవాణా చార్జీ చెల్లించకపోవడంతో సంబంధిత మ్యాంగో ర్యాంప్‌ను తహసీల్దార్ కిరణ్ శనివారం సీజ్ చేశారు. ఆయన కథనం మేరకు, చిత్తూరు నగరం గంగసారంలో రోడ్డు ఆనుకుని శ్రీ రామ ఫ్రూట్స్ ఎక్స్‌పోర్ట్ మ్యాంగో ర్యాంప్ నిర్వహిస్తున్నాడు. ఈ వ్యాపారి ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా వచ్చే మామిడి కాయలను కొనుగోలు చేస్తున్నాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు, తోతాపూరి రకం మామిడి కాయలకు కిలో రూ.12, రవాణా ఖర్చు రూ.1 చొప్పున చెల్లించాల్సి ఉంది. అయితే ఆ వ్యాపారి రవాణా చార్జీకి కోత పెట్టాడు. దీనిపై రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ కిరణ్ తన బృందంతో కలిసి విచారణ చేపట్టారు. రైతులు ఫిర్యాదు వాస్తవమేనని తేలడంతో 8 టన్నుల కాయలను, ర్యాంప్‌ను సీజ్ చేశారు. అనంతరం దీనిపై కలెక్టర్‌కు నివేదికలు సమర్పించారు. ఇ

నిర్ణయించిన ధర చెల్లించాల్సిందే

చిత్తూరు అగ్రికల్చర్: తోతాపురి రకం మామిడికి ప్రభుత్వం నిర్ణయించిన ధరను రైతులకు తప్పనిసరిగా చెల్లించాలని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన శనివారం చిత్తూరు పరిధిలోని పలు ర్యాంపులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గుజ్జు పరిశ్రమల యజమానులు సిండికేట్ అయి మామిడికి గిట్టుబాటు ధర చెల్లించడంలో మొండిచేయి చూపారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తోతాపురి రకం మామిడికి కిలో రూ.12కు తక్కువకాకుండా చెల్లించాలని, రవాణా ఖర్చుకింద కిలోకు అదనంగా రూపాయి చేర్చి మొత్తం రూ.13 చొప్పున చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తుచేశారు. ఎక్కడైనా ర్యాంపుల వద్ద ప్రకటించిన మేరకు ధర చెల్లించకుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

గిట్టుబాటు ధర

తిరుపతి అర్బన్: తోతాపురి మామిడి రకానికి గిట్టుబాటు ధర కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తిరుపతి జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘిస్తే సంబంధిత ఫ్యాక్టరీలపైన మండీలపైన చర్యలుంటాయని స్పష్టం చేశారు. కిలో తోతాపురి మామిడి ధర.12, రూపాయి రవాణా చార్జీలు మొత్తం కలిపి కిలోకు రూ.13 చెల్లించాలని తెలిపారు. తక్షణమే ఈ ధరలు అమలు చేయాలని స్పష్టం చేశారు.

జిల్లాకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చినట్లు ట్రాన్స్‌కో సాంకేతిక విభాగం ఈఈ సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 40, 25 కేవీ 80, 315 కేవీ 4, కండక్టర్ వైర్ 150 కిలోమీటర్లు, బ్రేకర్లు 20 వచ్చినట్లు వివరించారు. సంబంధిత ఏఈలు వర్క్‌ఆర్డర్లు పెట్టి మెటీరియల్ తీసుకోవాలని సూచించారు.



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73.00

అధికారులతో పనేముంది నాయనా..?



చిన్నాయమ్మతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస విశ్వనాథ్

పలమనేరు: వందేళ్లు దాటిన ఓ వృద్ధురాలు చిన్నాయమ్మ మంచంపై పడుకుని ఉంది. ఆ గ్రామంలో ఉపాధి పనుల పరిశీలనకు వెళ్లిన ఎంపీడీవో ''ఏం పెద్దాయమ్మా పింఛను తీసుకున్నావా'' అని ప్రశ్నించాడు. ఇంతకూ నీవెవరూ నాయనా అంది చిన్నాయమ్మ.''అవ్వా నేను పెద్దపంజాణి ఎంపీడీవో. నాపేరు శ్రీనివాస విశ్వనాథ్'' అని బదులిచ్చారు అధికారి. ''నాయనా జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోకి వచ్చాక నాలుగేళ్లుగా నేనున్న చోటుకే వలంటీర్ పింఛను తెచ్చి ఇస్తున్నాడు. ఈరోజు కూడా పొద్దునే వచ్చి రూ.2,750 చేతిలో పెట్టి పోయినాడు. ఇక నాకు అధికారులతో పనేముంది. ఆ మారాజు నిండు నూరేళ్లు చల్లగా ఉండాల'' అని దీవించింది. ఎంపీడీఓ ఆమెకు ధన్యవాదాలు తెలిపి వెనుదిరిగారు. ఈ ఘటన పెద్దపంజాణి మండలం పెద్దారికుంటలో శనివారం చోటుచేసుకుంది.

బైక్ ఢీకొని మహిళ మృతి

పలమనేరు : మండలంలోని బేలుపల్లి క్రాస్ వద్ద పలమనేరు–కుప్పం రహదారిపై శనివారం బైక్ ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. వివరాలు.. బైరెడ్డిపల్లె మండలం బురిశెట్టిపల్లెకు చెందిన సురేంద్ర భార్య శకుంతలమ్మ(54) నడుచుకుంటూ వస్తుండగా బైక్ ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన మోటారుసైకిలిస్టు పరారయ్యాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మైనింగ్ అధికారుల పేరుతో ట్రాక్టర్ అపహరణ

పలమనేరు : పట్టణంలోని మెయిన్ రోడ్డులో శనివారం మైనింగ్ అధికారులమంటూ కొందరు వ్యక్తులు ఓ ట్రాక్టర్‌ను అపహరించారు. కంకర లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్‌ను కొందరు యువకులు అడ్డుకున్నారు. పర్మిట్ చూపాలని డ్రైవర్‌ను బెదిరించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేస్తున్నామని డ్రైవర్‌ను దింపేశారు. తర్వాత దర్జాగా ట్రాక్టర్ తీసుకుని వెళ్లిపోయారు. దీనిపై డ్రైవర్ ప్రకాష్ వెంటనే యజమాని అశోక్‌కు సమాచారం అందించాడు. ఆయన విషయం తెలుసుకునేందుక మైనింగ్ అధికారులకు ఫోన్ చేయగా, తాము ఎక్కడా ట్రాక్టర్‌ను సీజ్ చేయలేదని చెప్పారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ట్రాక్టర్ యజమాని వెల్లడించారు.

దాడి కేసులో ఐదుగురి అరెస్ట్

చిత్తూరు అర్బన్: గంగ జాతర సమయంలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఐదుగురు నిందితులను చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. నగరంలోని శ్రీనివాసనగర్‌లో గత నెల గంగమ్మ జాతర నిర్వహించారు. కొందరు మద్యం సేవించి గొడవ చేస్తుండగా హరితేజ అనే వ్యక్తి వద్దని వారించాడు. దీంతో మందుబాబులు ఆగ్రహం పట్టలేక హరితేజపై కత్తితో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు నిందితులు చైతన్య, ప్రభు, మనోహర్, యశ్వంత్, శీనును అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్ నిమిత్తం జిల్లా జైలుకు తరలించారు.

4లోపు ఈకేవైసీ తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : సర్వీస్, ఫ్యామిలీ పెన్షనర్లు ఈ నెల 4వ తేదీ లోపు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని చిత్తూరు సబ్‌ట్రెజరీ అధికారి నరేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పింఛను పొందుతున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

చిత్తూరు అర్బన్: మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన లోకేష్ (19) అనే నిందితుడిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లోకేష్‌పై పోక్సో కేసు నమోదు చేశామని, నిందితుడిని చిత్తూరులోని సంతపేట వద్ద అరెస్టు చేసినట్లు సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

చిత్తూరు అర్బన్: మండలంలోని కేజీ సత్రం వద్ద ఎస్ఈబీ పోలీసులు శనివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో కర్ణాటక మద్యం తరలిస్తున్న కె.రామకృష్ణ(27) అనే యువకుడు పట్టుబడ్డాడు. నిందితుడు కారులో తీసుకువస్తున్న 96 టెట్రా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేసి రామకృష్ణను అరెస్ట్ చేశారు. తనిఖీల్లో ఎస్ఈబీ ట్రైనీ ఏఈఎస్ శ్రీరామ్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు